సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హాఫీజ్‌పేట్ : హాఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- మైత్రీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఆల్విన్ క్రాస్ రోడ్డు, జనప్రియ అపార్ట్‌మెంట్స్, జనప్రియనగర్, హాఫీజ్‌పేట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- హాఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఓల్డ్ హాఫీజ్‌పేట్ ఇండస్ట్రీయల్ ఏరియా, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, సాయినగర్, యూత్ కాలనీ, హనుమాన్ టెంపుల్ వార్డు ఆఫీస్, రైల్వే స్టేషన్ ఏరియాలలో విద్యుత్ ఉండదని ఏఈ రాజేందర్ తెలిపారు.
- **మియాపూర్:** పీజేఆర్, కేఎస్ఆర్, ఆర్‌టీసీ, పీఎస్ఆర్ హిల్స్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉ.10 గం నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు పీజేఆర్ ఫీడర్ పరిధిలోని జనప్రియ 9 వ్యాలీ, మాధవపురిహిల్స్, పీజేఆర్ ఎన్‌క్లేవ్ అలాగే.. కేఎస్ఆర్ ఫీడర్ పరిధిలోని అపర్ణ రోడ్డు, కేఎస్ఆర్ కాలనీ, ఆర్‌టీసీ కాలనీ ఫీడర్ పరిధిలోని శిల్పా లే ఔట్, ఆర్‌టీసీ కాలనీ.. పీఎస్ఆర్ హిల్స్ ఫీడర్ పరిధిలోని హెచ్ఎంటీ కాలనీ, స్వర్ణపురి కాలనీ, పీఎస్ఆర్ హిల్స్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శేరిలింగంపల్లిలో 6.44 లక్షల ఓటర్లు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటర్ల తుది జాబితా ప్రకారం 6,44,072 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3,42,651 మంది పురుష ఓటర్లు కాగా, 3,01,258 మహిళా ఓటర్లు ఉన్నారు. అదే విధంగా 136 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోనే అత్యధిక ఓటర్లు ఉన్నారు.

9న 'మనూ'లో ఫౌండేషన్ డే లెక్చర్

రాయదుర్గం: మనూ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 9వ తేదీ ఉదయం 11.30 గంటలకు గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని డీడీఈ ఆడిటోరియంలో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఏ.ఎం పఠాన్ ఉపన్యసిస్తారు.

నయ్యర్ ఇక్బాల్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూలో పరిశోధక విద్యార్థి నయ్యర్ ఇక్బాల్‌కు పీహెచ్‌డీ ని శుక్రవారం ప్రకటించారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ పర్యవేక్షణలో 'సాఫ్ట్ కంప్యూటింగ్ టెక్నిక్‌లను ఉపయోగించి ఫీచర్ ఎంపిక, వ్యాధి అంచనా' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. దీంతో ఆయనకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు.ఈ నేపథ్యంలో ఆయనను పలువురు పరిశోధక విద్యార్థులు అభినందించారు.

డా.రాహుల్‌కుమార్‌కు యంగ్ సైంటిస్ట్ అవార్డు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ రాహుల్‌కుమార్‌కు ప్రతిష్టాత్మక నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా (ఎన్ఏఎస్ఐ) స్కోపస్ యంగ్ సైంటిస్ట్ అవార్డుకు ఎంపికయ్యారు. డాక్టర్ రాహుల్‌కుమార్ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్. జీవశాస్త్రం, ఖనిజ పోషణ, పండ్ల పక్వానికి శాస్త్రీయ కృషికి ఈ అవార్డు లభించింది. ఈ అవార్డు కింద జ్ఞాపిక, రూ.75వేల నగదు పురస్కారం అందిస్తారు. రాహుల్ కుమార్ ప్రాథమిక పరిశోధనలో మొక్కలలో భాస్వరం వినియోగ సామర్థ్యం అంతర్లీనంగా ఉన్న జన్యు విధానాలపై దృష్టి సారించింది. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అధికారులు అభినందించారు.

చలి.. చిరు జల్లులు



గచ్చిబౌలి: చలి వణికిస్తోంది. ఉదయం మంచు, చిరు జల్లులు పడడంతో చలి పెరిగింది. దీంతో విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి చిరు జల్లులు పడడంతో స్వెట్టర్లు, గొడుగులతో ప్రజలు బయలుదేరారు.





మణికొండ మున్సిపాలిటీ ఓవర్ వ్యూ

ఫుల్..ఫుల్

● కనిపించని టు లెట్ బోర్డులు ● హాస్టళ్లలోనూ నో వెకెన్సీ

మణికొండ: రెండేళ్లుగా కరోనా కారణంగా కుదేలైన ఆదాయం ఇప్పుడిప్పుడే గాడిన పడుతోంది. వర్క్ ఫ్రం హోంను అన్ని సంస్థలు క్రమక్రమంగా తగ్గించడం, విద్యాసంస్థలు మళ్లీ ఆఫ్‌లైన్ పద్ధతిలో తెరుచుకోవడంతో అద్దె గృహాలకు డిమాండ్ ఏర్పడింది. హైదరాబాద్ నగరానికి పడమర భాగం అటు ఐటీ సంస్థలు, ఇటు చిత్రపరిశ్రమ, అన్ని రకాల వ్యాపార సముదాయాలకు సమీపంలోనే ఉంది. దీంతో కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం, మణికొండ, పుప్పాలగూడ, నానక్‌రాంగూడ, నార్సింగి, కోకాపేట, మంచిరేవుల, హైదర్‌షాకోట్, బండ్లగూడ ప్రాంతాలలో ఎక్కడా టు లెట్ బోర్డులు కనిపించటం లేదు. క్లాస్, మాస్ నివసించే అన్ని కాలనీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కరోనా కంటె ముందు ఉన్న అద్దెలు మళ్లీ తీసుకుంటున్నారు.

సింగిల్ బెడ్‌రూం రూ.10వేలు

గతేడాది జూన్ నుంచి పూర్తిస్థాయిలో పాఠశాలలు తెరుచుకోవటం, అక్టోబర్ మొదటి వారం నుంచి నుంచి ఐటీ సంస్థలు పూర్తి స్థాయిలో వర్క్ ఫ్రం హోం పద్ధతిని తొలగించడం నగరానికి వచ్చేవారి సంఖ్య పెరిగింది. దీంతో ఏకంగా సింగిల్ బెడ్ రూం అద్దె రూ.10వేలు, డబుల్ బెడ్ రూం రూ. 20 నుంచి రూ. 30వేలు, త్రిపుల్ బెడ్ రూం



అయితే రూ.25వేల నుంచి రూ.40 వేల వరకు చెబుతున్నారు.

జాడ లేని టు లెట్ బోర్డులు

మణికొండ, పుప్పాలగూడ, హైదర్‌షాకోట్, నార్సింగి, కోకాపేట, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో కరోనా సమయంలో ఎక్కడ చూసినా పదుల సంఖ్యలో టు లెట్ బోర్డులు కనిపించేవి. ప్రస్తుతం ఎక్కడా వాటి జాడ కనిపించటం లేదు. ఎక్కడో ఒక చోట పెట్టినా సాయంత్రానికే అద్దెకు దిగేస్తున్నారని ఇంటి యజమానులు చెబుతున్నారు. దీనిని బట్టి అద్దె గృహాల డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రెండు సంవత్సరాలుగా అద్దెలు లేక ఇన్‌స్టాల్ మెంట్లు, ఇతర వాయిదాలు చెల్లించడానికి అనేక ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం ఆ బాధలనుంచి బయట పడుతున్నామంటున్నారు.

హాస్టళ్లు హౌస్‌ఫుల్

ఐటీ సంస్థలతో పాటు ప్రముఖ విద్యా సంస్థలు హైదరాబాద్‌కు పడమర వైపున ఎక్కువగా ఉండటంతో ఉద్యోగులు, విద్యార్థులు ఉండే హాస్టళ్లకు డిమాండ్ పెరిగింది. ఆరు నెలల క్రితం వరకు సగంమంది కూడా లేక వెలవెలబోయిన హాస్టళ్లు కూడా ప్రస్తుతం హౌస్‌ఫుల్ బోర్డులతో దర్శనం ఇస్తున్నాయి. గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, కోకాపేట, గౌలిదొడ్డి ప్రాంతాల్లో అత్యధికంగా ఉన్న హాస్టళ్లలో గదులు దొరకటం లేదని పలువురు విద్యార్థులతో పాటు ఐటీ ఉద్యోగులు వాపోతున్నా రు. హాస్టల్‌లో టిఫిన్, భోజనాలతో కలిసి షేరింగ్ రూపంలో రూ. 5వేల నుంచి రూ. 10వేల వరకు చెల్లించేందుకు ముందుకు వస్తున్నా అనుకూలమైన గదులు లభించడం లేదని పలువురు వాపోతున్నారు.

పూర్వ స్థితికి వచ్చింది



కరోనా సమయంలో నెలల తరబడి ఖాళీగా ఉన్న గృహాలు ప్రస్తుతం పూర్తిస్థాయిలో అద్దెల వారితో నిండిపోయాయి. గతంలో ఆరు నెలల పాటు టు లెట్ బోర్డులు పెట్టినా ఎవరూ రానిది ప్రస్తుతం బోర్డు పెట్టిన రోజే అద్దెకు దిగుతున్నారు. రాబోయే రోజుల్లో డిమాండ్ ఇలాగే ఉంటే అద్దెలు ఇంకా పెరిగే అవకాశం ఉంటుంది.

– కె.పూర్ణచంద్రారెడ్డి, గృహాల యజమాని, మణికొండ

హాస్టల్ భవనాలు ఖాళీగా లేవు



ఐటీ సంస్థలు అన్నీ వర్క్ ఫ్రం హోంను పూర్తి స్థాయిలో ఎత్తివేయటంతో దూరప్రాంతాల ఐటీ ఉద్యోగులు హాస్టళ్లలో ఉండేందుకు ఆసక్తి చూపుతున్నారు. అలాంటి వారు ఎక్కువ కావటం, హాస్టల్ భవనాలు తక్కువగా ఉండటంతో భారీగా డిమాండ్ ఏర్పడింది. గతంలో ఒకరికి రూ. 3నుంచి రూ. 5 వేల వరకు సౌకర్యాలను బట్టి తీసుకునే వారు. ప్రస్తుతం డిమాండ్ పెరిగిపోవటంతో అది కాస్త రూ. 5వేల నుంచి రూ. 10వేల వరకు తీసుకుంటున్నారు.

– జి.నగేష్‌యాదవ్, హాస్టల్ భవన యజమాని, గౌలిదొడ్డి

ఆకట్టుకున్న విద్యార్థుల ఓపెన్ డే

రాయదుర్గం: ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలలో శుక్రవారం ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలోని గ్రేడ్ 7,8 చదివే విద్యార్థులు రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. ముఖ్యంగా సామాన్యశాస్త్రం, గణితం, సాంఘిక శాస్త్రం, తెలుగు, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టులలో తాము చదివిన అంశాలపై ఎగ్జిబిట్లను తయారు చేసి వాటి గురించి అధ్యాపకులు, తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఓక్రిడ్జ్ ప్రిన్సిపల్ దీపికారావు, సీబీఎస్ఈ హెడ్ రుక్మిణికుమార్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డేవిడ్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఓక్రిడ్జ్ స్కూలులో.. ఎగ్జిబిట్ల గురించి వివరిస్తున్న విద్యార్థి

యువత దేశ, సమాజ అభివృద్ధిలో పాల్గొనాలి

సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

రాయదుర్గం: యువత దేశ, సమాజ అభివృద్ధిలో చురుగ్గా పాల్గొనాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని యూత్ ఫర్ ఇంక్లూజివ్ అండ్ సస్టేనబుల్ సొసైటీ (వైఐఎస్ఎస్) విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు. నేటి తరం యువత, విద్యార్థులు ప్రత్యేకంగా పలు రకాల ట్రాన్స్‌ఫోమేషన్‌లు కలిగి ఉండాలని అందులో భావోద్వేగ, భౌతిక, ఆధ్యాత్మిక భావనలు ముఖ్యమైనవని అవి మిమ్మల్ని చైతన్యం చేస్తాయన్నారు. విద్యార్థి దశలో నైపుణ్యాలు పెంచుకోవడంపై కూడా దృష్టి సారించాలన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. వైఐఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి కీరవాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైఐఎస్ఎస్ జాతీయ నాయకులు గౌతమ్ అరుణ్‌కేతన్, కిరణ్‌కుమార్, లక్ష్మీనరసయ్య, పవన్ నాయక్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణకు స్వాగతం పలుకుతున్న కీరవాణి

కాన్‌ఫ్లిక్ట్ చిత్ర ప్రదర్శన



మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన కాన్‌ఫ్లిక్ట్ చిత్ర ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్, లెన్స్‌మాన్ వజ్రనాబ్ నటరాజ్ మహర్షి తీసిన చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శనలో 65 చిత్రాలను అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 12వ తేదీ వరకు ఉ.10.30 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ మోహనకృష్ణ గాంధీ,తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, మ్యూజిక్ డైరెక్టర్ రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ క్రికెట్ ప్లే గ్రౌండ్ ప్రారంభం



బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్: మియాపూర్‌లోని జేపీఎన్‌నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ ప్లే గ్రౌండ్‌ను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాంచందర్ ముదిరాజ్, నాయకులు వెంకటేష్, శివ, నిర్వాహకులు శశి, వర్మ, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి . శుక్రవారం 14 మందికి ర్యాపిడ్ యాంటిజెన్ పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగెటివ్‌గా నిర్ధారణ అయినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. అదేవిధంగా 13 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

25న గీతంలో చిరుధాన్యాల వేడుకలు

పటాన్‌చెరు టౌన్: ఈనెల 25వ తేదీన గీతంలో అంతర్జాతీయ చిరుధాన్యాల వేడుకలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఉమామహేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. చిరుధాన్యాల ఉత్పత్తి- వాటి వినియోగాలను పెంపొందించే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి, కేంద్ర ప్రభుత్వం 2023ను చిరుధాన్యాల ఏడాదిగా ప్రకటించాయన్నారు. కార్యక్రమానికి హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ డైరెక్టర్ సీవీ రత్నావతితో పాటు పలువురు శాస్త్రవేత్తలు హాజరుకానున్నారని తెలిపారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై వాల్‌పోస్టర్ పోటీ నిర్వహిస్తున్నామని.. ఉత్తమ రూపకల్పన చేసిన తొలి పది పోస్టర్లను ఎంపిక చేసి వాటిలో అత్యుత్తమమైన మూడు పోస్టర్లకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. అలాగే ఆయా అంశాలపై ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు సైతం నిర్వహిస్తున్నామని వివరించారు. ఆసక్తి గల వారు తమ పేర్లను ఈనెల 21వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99495 00753 లేదా 95815 98698 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జేఎన్‌వీలో కల్చరల్ మీట్, ఆర్ట్ ఎగ్జిబిషన్

రాయదుర్గం: గోపనపల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయలో రీజనల్ స్థాయి కల్చరల్ మీట్, ఆర్ట్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమిషనర్ వినాయకన్, ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్‌తో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. జేఎన్‌వీ హైదరాబాద్ రీజన్ పరిధిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ రాష్ట్రాలు, పాండిచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాలలోని జవహర్ నవోదయ విద్యాలయాలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. 250 మంది వివిధ ప్రాంతాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విజువల్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్, సెమినార్, క్రియేటివ్ రైటింగ్ వంటి పోటీలను నిర్వహిస్తున్నారు. రెండు రోజులపాటు ఈ పోటీలను నిర్వహిస్తారు.

బస్సు ఢీ కొని వ్యక్తి మృతి

గచ్చిబౌలి: కాలేజ్ బస్సు ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సురేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇండియన్ ఇమ్యూనోలాజికల్ లిమిటెడ్ ఉద్యోగి అనసూరి శ్రీహర్ష(37) బీరంగూడలో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం 8 గంటలకు పల్సర్ బైక్‌పై డ్యూటీకి వెళుతుండగా హెచ్‌సీయూ డిపో సిగ్నల్ దాటిన తరువాత జేబీఐటీకి చెందిన బస్సు ఢీకొనడంతో శ్రీహర్ష తీవ్రంగా గాయపడడంతో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ జన్మదిన వేడుకలు



భిక్షపతి యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, బీజేపీ నాయకులు



భిక్షపతి యాదవ్‌కు కేక్ తినిపిస్తున్న అనిల్‌కుమార్ యాదవ్

గచ్చిబౌలి: మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతి యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మసీద్‌బండలోని ఆయన నివాసంలో పలువురు బీజేపీ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్, సదానంద్ యాదవ్‌ల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో లడ్డు యాదవ్, మహేష్ యాదవ్, విఠల్, బాల వెంకటేష్ యాదవ్‌లతో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి అభిమానులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్ల ధర్నా

శేరిలింగంపల్లి: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ శేరిలింగంపల్లి జోన్ కార్యదర్శి కొంగరి కృష్ణ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ, గిరిజన ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందజేయడంలో స్కీమ్ వర్కర్ల పాత్ర ముఖ్యమైందన్నారు. ఇందులో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు ఉంటారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో పెరుగుతున్న ధరలు, చాలీ చాలని వేతనాలతో అంగన్‌వాడీ వర్కర్లు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కృష్ణ డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు.



తహశీల్దార్ కార్యాలయ ఉద్యోగికి వినతి పత్రం అందజేస్తున్న వర్కర్లు

నిర్మాణానికి నిధులు ఇవ్వండి

పటాన్‌చెరు టౌన్: బాక్స్ డ్రైన్ నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ కోరారు. శుక్రవారం జీహెచ్ఎంసీ పట్టణ చీఫ్ ప్లానర్ దేవేందర్, ఇంజినీర్ జియావుద్దీన్‌ను కలిసి డివిజన్‌లోని సమస్యను వివరించారు. శాశ్వత పరిష్కారానికి బాక్స్ డ్రైన్ నిర్మించాలని, ఇందుకు గాను ఎస్ఎన్‌డీపీ కింద నిధులు మంజూరు చేయాలని ఆయన అధికారులను కోరారు. అంబేడ్కర్ కాలనీలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి తిమ్మక్కచెరువు వరకు బాక్స్ డ్రైన్‌ను నిర్మించాలని కోరినట్లు తెలిపారు.



జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కుమార్

మౌలిక వసతుల కల్పనకు కృషి

కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్

హాఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని కృష్ణ కాలనీలో నెలకొన్న సమస్యలపై స్థానికులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదాపూర్ డివిజన్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో కాలనీ బస్తీ అధ్యక్షుడు కృష్ణ యాదవ్, నర్సింగ్ రావు, రాములు యాదవ్, అంకారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణ కాలనీలో సమస్యలపై స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్

ముగ్గుల పోటీలు

మియాపూర్: మియాపూర్ ప్రగతి ఎన్‌క్లేవ్‌లోని నీలిమా హైట్స్, గ్రీన్స్ కాలనీల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా కొమిరిశెట్టి ఫౌండేషన్, విజేత సూపర్ మార్కెట్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంగు రంగుల ముగ్గులను వేశారు. ఈ ముగ్గుల పోటీల్లో టి. వరలక్ష్మీ, విజయలక్ష్మీలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో మహిళలు చంద్రవతి, మాలతి, ఉమ, రజిత, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్‌యాదవ్, సాంబశివరావు, సీతారాం, రాహుల్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన వార్షిక క్రీడా సంబరాలు

హాఫీజ్‌పేట్ : డివిజన్ పరిధిలోని మదీనాగూడ త్రివేణి పాఠశాలలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న వార్షిక క్రీడా సంబరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా హాకీ ట్రిపుల్ ఒలింపియాన్ అర్జున అవార్డు గ్రహీత పద్మశ్రీ నందనూరి ముఖేష్ కుమార్, త్రివేణి, కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్ జగదీష్, రంగారెడ్డి జిల్లా హాకీ ఫెడరేషన్ సెక్రటరీ భాస్కర్ రెడ్డిలు హాజరయ్యారు. విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సీఏసీ డాక్టర్ నటరాజ్, సీఆర్ఓ సాయి నర్సింహారావు, సీఏఓ చంచారావు, సెంటర్ ఐఐటీ కోఆర్డినేటర్ చక్రి, సుబ్బారావు, పాఠశాల ప్రిన్సిపల్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



విజేత విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న పద్మశ్రీ ముఖేష్ కుమార్ తదితరులు

ఆకట్టుకుంటున్న హస్తకళా ప్రదర్శన





మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న హస్తకళా ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటుంది. అస్సాం కళాకారులు వెదురుతో తయారు చేసిన బుట్టలు, హర్యానా చెప్పులు, గుజరాత్ బాందీని వర్క్ కోల్‌కత్తా కాంత వర్క్ తదితర ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. దేవతా మూర్తుల విగ్రహాలు, గృహాలంకరణ ఉత్పత్తులు, పెయింటింగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అస్సాం నుంచి వచ్చిన భరతనాట్య కళాకారిణి , మంజుల శిష్య బృందం కూచిపూడి నృత్యప్రదర్శన, హర్యానా రాష్ట్ర జానపద నృత్యాలను ప్రదర్శించి అలరించారు.